మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలి

గడ్డం శ్రీనివాస్‌యాదవ్

అబిడ్స్, మే 18: పాత బస్తీ గుల్జార్‌హౌస్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవాలని బీఆర్ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి నిద్రిస్తున్న సమయంలో అగ్నిప్రమాదం సంభవించి భారీ ఎత్తున పొగలు చేరుకోవడంతో 17 మంది దుర్మరణం పాలు కావడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన ఎక్‌గ్రేషియాను రూ. 10 లక్షలకు పెంచాలని కోరారు. అంతేకాకుండా గాయాల పాలైన వారికి చికిత్స అందించి వాళ్లు త్వరగా కోలుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే

మెహిదీపట్నం, మే 18 : ప్రజలకు ప్రభుత్వ పథకాలను అందించడానికి కృషి చేస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. ఆదివారం టోలిచౌకి ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కౌసర్ మొయినుద్దీన్ అందజేశారు.

సెంట్రల్ జోన్ డీసీపీని కలిసిన ఎమ్మెల్సీ

శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ అధికారులు పకడ్బందీగా కృషి చేయాలని ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్ ఖాద్రి అన్నారు. ఆదివారం సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లిని ఆయన కలిసి మాట్లాడారు.

– మెహిదీపట్నం, మే 18

సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలి

జైస్వాల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

- ప్రజలకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పిలుపు

గోల్నాక, మే 18: సీసీ కెమెరాల ఏర్పాటుకు కాలనీలు, బస్తీల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆదివారం గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కాలనీ ప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...సీసీ కెమెరాలు నేరాలను నిరోధిస్తాయని, కెమెరాల ద్వారా మరింత భద్రత ఏర్పడుతుందన్నారు. అంబర్ పేట నియోజకవర్గాన్ని నేర రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. వాడవాడలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని అన్నారు. డివిజన్లలో సీసీకెమెరాల ఏర్పాటుకు ముఖ్యంగా మహిళలు, యువకులు, చొరవ చూపాలన్నారు. సీసీ కెమెరాలు ఉన్న ఏరియాల్లో నేర సంఘటనలు తక్కువగా ఉంటాయని, ఒక వేళ జరిగిన వెంటనే తెలుసుకోవచ్చునన్నారు. ఒక్క సీసీ కెమెరాల వంద మంది పోలీసులతో సమానమన్నారు. సీసీ కెమెరాలు ఉన్న ఏరియాల్లో 24గంటలు ప్రజలకు రక్షణలా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జైస్వాల్ గార్డెన్ రెసిడెన్స్ అసోసియేషన్ ప్రతినిధులు సత్యం గౌడ్, స్వామి గౌడ్, జి. ప్రసన్నాంజనేయులు,ఏ.రామాగౌడ్, సి.యాదవరెడ్డి, సీహెచ్ ఇంద్రసేనా యాదవ్, డ్, పి. శ్రీహరి చారి, , జి.సురేందర్, బి. మధుసూదనచారి, కె. అశోక్ కుమార్, కె. ఈశ్వరయ్య, పి. రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలి

పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో గాలయ్య, టీ జితేందర్‌సింగ్ , నిషాసింగ్

అబిడ్స్, మే 18: క్రమశిక్షణతో ఉండి తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని తెలంగాణ రికగ్నైసేడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆసిఫ్ నగర్ గౌరవ అధ్యక్షుడు గాలయ అన్నారు. తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్, రిలయన్స్ హైటెక్ జూనియర్ కాలేజీల ఆధ్వర్యంలో 2024 – 25 సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు రిలయన్స్ విద్యాసంస్థల అధినేత టి. జితేందర్‌సింగ్‌తో కలిసి ప్రతిభా పురస్కారాలు పంపిణీ చేశారు. రిలయన్స్ హైటెక్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని టి. జితేందర్ సింగ్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం అధ్యక్షుడు రవి కుమార్ మాట్లాడుతూ.. రిలయన్స్ హైటెక్ స్కూల్, జూనియర్ కాలేజీ ఉన్నతమైన విద్యకు నిలయం అని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ టీ నిషా సింగ్ మాట్లాడుతూ.. తమ కళాశాల ఉన్నత ప్రమాణాలను పాటిస్తూ విద్యాబోధన అందిస్తుందని తెలిపారు. రిలయన్స్ విద్యాసంస్థల అధినేత టీ జితేందర్ సింగ్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించాలని ఉద్దేశంతో 2024 –25 సంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు.

21న జైహింద్ ఇండియన్ ఆర్మీ అభినందన సభ

రవీంద్రభారతి, మే18 : శ్రుతిలయ ఫౌండేషన్,–సీల్‌వెల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21 తేదీ సాయంత్ర 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో సీల్‌వెల్ సినీ సుస్వరాలు–74 జైహింద్ ఇండియన్ ఆర్మీ అభినందన సభ, దేశభక్తి గీతాలు, ఎన్‌టీఆర్, కృష్ణ సినీ గీతాంజిలి, పుణ్యభూమి నాదేశం నమోనమామి ప్రముఖ గాయని గాయకులచేత కార్యక్రమం ఉంటుందని సీల్‌వెల్ సీఎండీ బండారు సుబ్బారావు, శ్రుతిలయ చైర్మన్ భొక్క భీమ్‌రెడ్డి, శ్రుతిలయ కార్యదర్శి గాయన ఆమని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కోలేటి దామోదర్‌గుప్తా, ముత్యాల హరికృష్ణ, గుత్త వెంకట్‌రెడ్డి తదితరులు విచ్చేయనున్నట్లు తెలిపారు. ఈ సభకు మందు ప్రముఖ గాయని ఆమని బృందంచే సీల్‌వెల్ సినీసుస్వరాలు74 కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

చట్టాల అమలులో కేంద్ర, రాష్ట్రపభుత్వాలు విఫలం

హిమాయత్ నగర్, మే18: అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నాయని ఆరోపించారు. ప్రభు త్వ రంగాలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తు న్నాయని అన్నారు. అసంఘటి త రంగంలో పని చేసే కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోవడంతో పాటు ఉపాధి అవకాశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం అందేలా చొరవ చూపాలని కోరారు.

చలం రచనలకు స్త్రీయే వెన్నెముక

చలం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

రవీంద్రభారతి, మే18 : చలం రచనలు చేసిన కాలం తరువాత ఎనిమిది దశాబ్దాలు గడిచాక కూడా ఇప్పటికీ చలం రచనల గురించి మాట్లాడుకుంటున్నామంటే ఆ రచనల యొక్క సార్వకాలీనతను అర్థం చేసుకోవచ్చునని పలువురు వక్తలు పేర్కొన్నారు. జీవజలం చలం సాహిత్య స్మారకోపన్యాస సభ ఆదివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా కెఎన్ మల్లీశ్వరి, నెల్లుట్ల రమాదేవి, డా.సలీమా, డా. లక్ష్మీఅసిరెడ్డి, డా. దాసోజు పద్మావతి, డా. శ్రీభాష్యం అనూరాధ,సభా అధ్యక్షుడుగా తెలంగాణ రచయితల సంఘం కన్వీనర్ నాళేశ్వరం శంకరం తదితరులు విచ్చేసి ప్రసంగించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చలం మొత్తం రచనలకు వెన్నెముక స్త్రీ వ్యాససంపుటాలే, స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని, స్త్రీ పురుష సమానత్వాన్ని ఏ ఆధిపత్యాలు లేని జీవితం స్త్రీ గడపాలని ఆకాక్షించారు. ఈ కార్యకరమంలో పలువురు చలం అభిమానులు, సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

చంద్రభాగ పుస్తక పరిచయ సభ

సమావేశంలో మాట్లాడుతున్న సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి

రవీంద్రభారతి, మే18 : తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో నిర్వహిస్తున్న సాహిత్య వారం కార్యక్రమంలో డా.నామోజు బాలాచారి, కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షతన ప్రముఖ కథా రచయిత, అనువాదకులు డా.రూప్‌కుమార్ డబ్బీకార్ అనువదించిన జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీతల కథల అనువాద సంకలనం చంద్రభాగ పుస్తక పరిచయ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సభలో ప్రముఖ విమర్శకులు ఆచార్య టి. గౌరీశంకర్ పుస్తక పరిచయం చేస్తూ కథల్లోని సామాజిక, వైయుక్తిక, రాజకీయ వైరుధ్యాలు ఏ విధంగా వ్యవస్థలపను, మనిషిని సంఘర్షణకు గురిచేస్తున్నాయని వివరించారు. విమర్శకులు సి.ఎస్. రాంబాబు మాట్లాడుతూ.. కథల ఎన్నిక, వస్తువు గరించి అనువాదాల్లోని వ్యాక్యాలు చాలా చోట్ల కవితాత్మకంగా ఉంటూ పాఠకున్ని కట్టి పడేస్తాయి. డా. నామోజు బాలాచారి మాట్లాడుతూ.. అతెలంగాణ సాహిత్య గ్రంథాల ప్రచురణ బాధ్యతలను తీసుకోవడమే గాక ఆ గ్రంథాలను సాహిత్య రంగానికి పరిచయం చేస్తూ కవులకు, రచయితలకు సహకరిస్తుందని చెప్పారు. ఈ దిశగానే చంద్రభాగ ప్రచురించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాళేశ్వరం శంకరం, కటుకోజ్వల ఆనందాచారి, ఆడెపు లక్ష్మీపతి, హనీఫ్, ఒద్గిరాజు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

21న ఓయూకాలనీ సహకార సంఘం ఎన్నికలు

- నామినేషన్ ప్రపోజర్‌గా చనిపోయిన వ్యక్తి సంతకం

మెహిదీపట్నం, మే 18 : షేక్‌పేట్ ఓయూ కాలనీ సహకార సంఘం ఎన్నికలు ఈనెల 20న జరగవలసి ఉంది. మాలకొండయ్య సహకార సంఘ అధికారుల ప్రోత్సాహంతో నామినేషన్ వేయడం జరిగింది. అతని నామినేషన్ ప్రపోజర్‌గా చేర్యాల రామదాసు పేరున సంతకం పెట్టారు. అతడి అడ్మిషన్ నంబరు. 66. ఇదిలా ఉండగా చేర్యాల రామదాసు 11 /9/ 2013 సంవత్సరంలోనే చనిపోయాడు. ఈ విషయం ఓటర్ లిస్టు తయారు చేసిన ప్రభుత్వ పర్సన్ ఇన్‌చార్జి బీమ్‌రాజీకి తెలుసు. గతంలో కొందరితో కుమ్మక్కై భీమరాజు చేసిన అవకతవకలు కప్పిపుచ్చుకొనుటకు తనకు అనుకూలమైన వారు ఎన్నిక అవడం కోసం చనిపోయి న వ్యక్తి పేరుతో సంతకం పెట్టించాడు. ఇదే సందర్భంగా బి. విజయ్‌కుమార్ అనే సభ్య డు నామినేషన్ వేయడం జరిగింది. ఈయన అడ్మిషన్ నంబర్ 1085 సన్నాఫ్ సుబ్బరాయుడు వివరాలు అన్నీ సరిగా ఉ న్నా కూడా ఇంటిపేరు తప్పు ఉందని ఇత ని నామినేషన్‌ను తిరస్కరించారు. గతంలో భీమరాజ్ చేసిన అవకతవకలు ప్రశ్నించినందుకు, అతడిని తనకు వ్యతిరేకంగా భావించి ఎన్నికల అధికారి మీది ఒత్తిడి తెచ్చి ఆయన నామినేషన్‌ను భీమ్ రాజ్ తిరస్కరించేలా చేశాడు. ఇలా తవ్విన కొద్ది సదరు భీమరాజు చేసిన అవకతవకలు కోకొల్లలు. వీరిపైన ఈ ఘటనకు బాధ్యులైన వారి పైన తగిన చర్య తీసుకోవలసినదిగా సంఘ సభ్యులు కోరుతున్నారు.

సంగీతంతో మానసిక ప్రశాంతత..

హిమాయత్ నగర్ లో జరిగిన కార్యక్రమంలో రమాప్రభను సత్కరిస్తున్న ప్రతినిధులు

హిమాయత్‌నగర్,మే18 : సంగీతంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆంధ్ర మహిళా సభ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాప్రభ ఎర్రమిల్లి అన్నారు. రాగ తరంగిణి మ్యూజిక్ స్కూల్ వార్షి కోత్సవ సంగీత వేడుకల సందర్భంగా ఆదివారం హిమాయత్ నగర్‌లోని సరేగ స్టూడియోలో కర్ణాటక సంగీత గాత్ర కచేరి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు మంచి భవిష్యత్తు ఉందని, అంకిత భావంతో సంగీతంను నేర్చుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. భారతీయ తాత్విక మూలలు త్యాగ రాజ స్వామి కీర్తనల్లో దర్శనమిస్తాయన్నారు. గురుతరంగిణి శిష్యులు స్వాన్వీసిద్ధి, ప్రేక్షారెడ్డి, శ్రేష్ట బైరెడ్డి ఆలపించిన మహాగణపతి, అన్నమాచార్య, త్యాగరాయ స్వామి కీర్తనలు, కర్ణాటక సంగీత కచేరి ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. మృదంగంపై డాక్టర్ ఆర్.శ్రీకాంత్, వయోలిన్ ఫై పవన్ సింగ్ వాద్య సహకారం అందించారు.

సెక్యూరిటీ గార్డు అదృశ్యం

శంషాబాద్ రూరల్, మే 18 : సెక్యూరిటీ గార్డు అదృశ్యమైన ఘటన శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. అస్సాంకు చెందిన రాజుతంతి (42)తో పాటు అతడి తమ్ముడు భీజు తంతి కలిసి ఎనిమిదేండ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి ఇక్కడే సెక్యూరిటీగార్డుగా పని చే స్తున్నారు. అందులో భాగంగా శంషాబాద్ మండలంలోని కవేలిగూడ గ్రామ పరిధిలోని గ్రీన్ ఫుడ్ ఫామ్‌హౌజ్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న రాజు తంతి ఈ నెల 10 తేదీన రాత్రి 8 గంటల సమయంలో అతడు ఉండే గదికి తాళం వేసి వెళ్లిపోయాడు. రెండు రోజులైనా అతడు తిరిగిరాకపోవడంతో అతనితో పాటు పని చేసే మధ్యప్రదేశ్‌కు చెందిన రాకేష్ గండిపేట్ మండలంలోని ఖానాపూర్‌లో ఓ ఫాంహౌజ్‌లో పని చేస్తు రాజు తంతి సోదరుడికి ఫోన్‌చేసి సమాచారం ఇచ్చాడు. దీంతో అక్కడికి చేరుకున్న భీజు తంతి చుట్టూ పక్కల వెతికినా ఫలితంలేకపోవడంతో ఆదివారం శంషాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుల్జర్‌హౌస్ మృతుల కుటుంబాలకు పరామర్శ

ఉస్మానియా మార్చురీ వద్ద టీడీపీ నాయకుల బృందం

అబిడ్స్ మే 18: హైదరాబాద్‌లోని పాత బస్తీ గుల్జర్‌హౌస్‌లోనీ వాణిజ్య భవవంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో 17 మంది మృతి చెందడం చాలా బాధాకరమని టీడీపీ హైదరాబాద్ పార్లమెంట్ కో–ఆర్డినేటర్ నాగునగేష్ అన్నారు. ఉస్మానియా ఆస్పత్రిలో మృతుల బంధువులను నాగునగేష్, కేడీ దినేష్, జోగిందర్ సింగ్ పరామర్శించి, సంతాపం తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని కోరారు. ఉస్మానియా దవాఖాన వైద్యులను కలిసి చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

నేడు ఫీజుల నియంత్రణపై రౌండ్ టేబుల్ సమావేశం

అడ్డగుట్ట, మే 18: ప్రైవేట్ పాఠశాలల్లో ఇష్టానుసారంగా తీసుకుంటున్న ఫీజుల నియంత్రణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేస్తూ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అరకొర వసతులను కల్పిస్తూ ఫీజుల విషయంలో మాత్రం కచ్చితంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై నిఘా అవసరమని, ఫీజుల నియంత్రణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతుందని పలు సర్వేల్లో ఇప్పటికే వెళ్లడైందని వారు పేర్కొన్నారు. చాలా వరకు ప్రైవేట్ పాఠశాలలు రెట్టింపు ఫీజులను వసూలు చేస్తూ తల్లిదండ్రులపై పెను భారాన్ని మోపుతున్నాయని అన్నారు.

జాతీయ జెండాలతో ర్యాలీ

బన్సీలాల్‌పేట్ : ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన భారత సైన్యాన్ని అభినందిస్తూ, పద్మారావునగర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సభ్యులు కలిసి ర్యాలీని విజయవంతం చేశారు.

మార్కెట్ యార్డులో సమస్యల తిష్ఠ

- నోపార్కింగ్ జోన్లో భారీ వాహనాలు
- పాదచారులకు తప్పని ఇబ్బందులు
- ముక్కుపుటలదిరేలా వస్తున్న దుర్గంధం

వాహనాలు నిలపడంతో మురుగులో నుంచే రాకపోకలు

వ్యర్థాలతో దర్శనమిస్తున్న కూరగాయల మార్కెట్ ప్రాంగణం

బొల్లారం, మే 17: బోయిన్‌పల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్‌లో సమస్యలు తిష్టవేస్తున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి రైతులు వివిధ రకాల కూరగాయలను ఇక్కడికి నిత్యం తీసుకొని వస్తుంటారు. ప్రతిరోజూ వందలాది మంది సంచరించే బోయిన్‌పల్లి మార్కెట్ యార్డ్‌లో ఎక్కడపడితే అక్కడే వ్యర్థమైన కూరగాయలు పడేయడంతో దుర్వాసన వెదజల్లడంతో చుట్టుపక్కల బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. టమాటా ధర లేక రైతులు దిగులు పడుతుంటే, మార్కెట్లో వ్యర్థమైన కూరగాయలు ఎక్కడ పడితే అక్కడ వేయడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని అన్నారు. దీనికి తోడుగా చిన్నపాటి వర్షానికే మార్కెట్లో రోడ్లు మురికి కూపాలను తలపిస్తున్నాయి. ముక్కుపుటలు అదిరిపోయేలా దుర్గంధం వెదలజ్లుతోందని వినియోగదారులు పేర్కొంటున్నారు. ఓవైపు నో పార్కింగ్ జోన్ ఉన్నా భారీ వాహనాలు అక్కడే పార్క్ చేస్తున్నారు. దీంతో పాదాచారాలు ఎట్లా వెళ్లాలో తెలియక తీవ్ర అవస్థలు పడుతున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

అడ్డంగా దొరికారు..

అనుమతి లేకుండా రోడ్డు తవ్వకం
జీహెచ్ఎంసీ సిబ్బంది సహకారం..?

బంజారాహిల్స్, మే 18 : ***బంజారాహిల్స్ రోడ్డు నం 12లోని సితార హోటల్ నుంచి ఎస్‌బీఐ క్వార్టర్స్ వైపు 30 ఫీట్ల రోడ్డుపై ప్రేమ్‌చంద్‌గుప్తాలు సుమారు 600 గజాల స్థలంలో భవన నిర్మాణపనులు చేపట్టారు. ఏడాది క్రితం నిర్దేశించిన ప్రమాణాలతో భవనాన్ని నిర్మించడం లేదన్న కారణంగా జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు భవనంలో కొంతభాగాన్ని కూల్చేశారు. ఇటీవల మరోసారి పనులు చేపట్టిన నిర్మాణదారులు సీవరేజీలైన్ కోసం జల మండలి వద్దనుంచి అనుమతి తీసుకున్నారు. అయితే జీహెచ్ఎంసీ నుంచి రోడ్డు కటింగ్ అనుమతి కోసం నిర్దేశిత రుసుము చెల్లించకుండానే పనులు ప్రారంభించారు.***

జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులంతా బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ వద్ద మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించిన ఏర్పాట్లలో బిజీగా ఉన్న విషయాన్ని తెలుసుకుని ఆదివారం పట్టపగలే ఓ బిల్డర్ ఎలాంటి అనుమతి లేకుండా సుమారు 15మీటర్ల మేర జీహెచ్ఎంసీ రోడ్డును అడ్డగోలుగా తవ్వేశారు. సమాచారం అందుకున్న జీహెచ్ఎంసీ అధికారులు అక్కడకు చేరుకోగా పనులు పూర్తిచేసి సిమెంట్‌తో మరమ్మతులు చేసేందుకు ప్రయత్నిస్తూ అడ్డంగా దొరికిపోయారు.

డీఈ అభినవ్‌కుమార్ ఆదేశాలతో అక్కడకు చేరుకున్న జీహెచ్ఎంసీ సిబ్బంది పనులను అడ్డుకున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో జీహెచ్ఎంసీకి చెందిన ఓ వర్క్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు జలమండలికి చెందిన ఓ ప్రైవేటు కాంట్రాక్టర్ కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. జీహెచ్ఎంసీకి రావాల్సిన రుసుమును ఎగవేసి ప్రైవేటువ్యక్తుల జేబుల్లోకి వెళ్లేలా చేస్తున్న చర్యలపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై బిల్డర్‌తో పాటు బాధ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని జీహెచ్ఎంసీ ఈఈ విజయ్‌కుమార్ తెలిపారు.

జీహెచ్ఎంసీ అధికారులు రావడంతో సిమెంట్ వేసి రోడ్డును పూడుస్తున్న దృశ్యం

బంజారాహిల్స్ రోడ్డు 12లో అనుమతి లేకుండా రోడ్డును తవ్వుతున్న దృశ్యం